www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 16 సెప్టెంబర్ 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం ఎంపిడిఒగా జి.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ ఉద్యోగులు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మలికిపురం ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు అందరి సహకారంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని అన్నారు.



ఎంపిడిఒకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ఇబ్బందుల్లో ఆటో కార్మికులు

- ఉచిత బస్సుతో ఉపాధికి ముప్పు
- ఫైనాన్స్‌లపైనే ఆటోల కొనుగోలు
- నెలనెలా వాయిదాలతో ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ ఉపాధికి డ్రైవర్ల డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి - రాజోలు

తమ ఉపాధిని దెబ్బతీసేలా ఉచిత బస్సు పథకం అమలు పై కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఆటో యూనియన్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఆటో యూనియన్లతో కనీసం చర్చించలేదని అంటున్నారు. ఆటోల ద్వారా ప్రభుత్వానికి పలురకాలుగా ఆదాయం వస్తుందని చెబుతున్నారు. డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థికసాయం వంటి వాటిపై మాట్లాడకపోవడం దారుణమని వాపోతున్నారు. ఆటోలకు గిరాకీ లేక ఆదాయం సగానికి పడిపోవడంతో పాటు పెరిగిపోతున్న ఫైనాన్స్ భారాన్ని మోయలేక రోడ్డెక్కుతున్నారు. దశల వారీగా ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆటో కార్మికుల ఆందోళనలు ఉధృతం చేశారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం తీసుకొచ్చిన తరువాత కార్మికుల రోజువారీ ఆదాయానికి భారీగా గండి పడింది. గతంలో రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం చూసిన కార్మికులకు ప్రస్తుతం రూ.300 నుంచి రూ.500 రావడం లేదు. దీనితో జిల్లాలో సుమారు 25 వేలకు మందికి పైగా ఉన్న కార్మికుల జీవనోపాధికి గండి పడింది. తమ పొట్ట కొట్టడానికి ఈ పథకాన్ని తీసుకువచ్చారని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫైనాన్స్ కట్టలేక....!

జిల్లాలో నడుస్తున్న 90 శాతం ఆటోలను డ్రైవర్లు ఫైనాన్స్‌పై కొనుగోలు చేశారు. ఆటో ధర రూ.4 లక్షల వరకు ఉంది.. నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు వాయిదా కడుతున్నారు. అలాగే నెలకు ఆటో నిర్వహణకు రూ.2 వేలు, మరమ్మతులకు రూ.3 వేలు మొత్తంగా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. వీటితో పాటు రవాణా శాఖ అధికారుల కేసులు, ఏడాదికి బ్రేక్, ఫిట్నెస్ కోసం ఖర్చులు అదనం. ఈ పరిస్థితుల్లో రోజుకు డీజిల్ ఖర్చులు కాకుండా వీటి కోసమే రూ.800కు పైగా వెచ్చించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఉచిత బస్సుతో ప్రయాణికులు లేక ఆటోలు నడపకపోతే జీవనం ఎలా సాగుతుందని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

ప్రభుత్వం పట్టించుకోక..

ప్రధాన మార్గాల్లో ఆదాయం కోల్పోవడం ఆటోకార్మికుల రోజువారీ జీవనానికి సైతం కష్టాలు వచ్చాయి. ఇతర మార్గాల్లో ఆటోలు తిప్పుతుంటే ఇతర కార్మికుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. నిత్యం సర్వీసులు తిరిగే మార్గాల్లో ఆదాయం లేకుండా పోయింది. ఇప్పటికే జిల్లాలో దశల వారీగా రోడ్డున పడ్డ ఉద్యమాన్ని చేపట్టారు. ఆటోలకు నల్ల జెండాలు కట్టి నిరసన తెలుపుతున్నారు. మండలాల వారీగా రాస్తారోకోలు, ధర్నాలు, ఆటోలతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రూ.15 వేలు ఏపాటి..?

దసరా కానుకగా ఓనర్ కం డ్రైవర్ ఉన్న ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే తమ జీవన పోషణకు రూ.15 వేలు ఏపాటి అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఓనర్ కం డ్రైవర్ పని చేస్తున్న వారితోపాటు, వేలాది మంది కార్మికులు ఆటోలను అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. వారి పరిస్థితి ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకుండా ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించడాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారు.

న్యాయం చేయాలి



ఇప్పటికే ఆటోలు పెరిగి డ్రైవర్లకు ఉపాధి అంతంతమాత్రంగా ఉంది. ఉచిత బస్సుతో పూర్తిగా ఉపాధి కోల్పోయి ఆటోలను ఫైనాన్స్ కంపెనీలకు అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రైవర్లంతా ఆటోలు వదిలి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలి. ఆటోడ్రైవర్ల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి.

- సిహెచ్.దుర్గా ప్రసాద్, ఆటోడ్రైవర్, శివకోటి

ఉపాధి కల్పించాలి



ఉచిత బస్సు పథకంతో తమ జీవితాలు ఆందోళనలో పడ్డాయి. ఆటోలు ఎక్కేవారి సంఖ్య తగ్గిపోతుంది. బ్రతుకులు లేక, ఆదాయం రాక కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. మాకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి. ఆదాయ మార్గం చూపాక ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలి.

- కట్టా శ్రీను ఆటోడ్రైవర్, రాజోలు

రూ.25 వేలు ఇవ్వాలి



ఉచిత బస్సు పథకంతో రోడ్డున పడ్డ ఆటో కార్మికులందరికీ ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలి. వడ్డీ లేని ఆటో రుణాలు ఇవ్వాలి. ఆటో గ్యాస్, ఇన్సూరెన్స్ రేట్లలో రాయితీలు కల్పించాలి. ఉచిత బస్సు పథకానికి ఎవరూ వ్యతిరేకం కాదు. కానీ స్త్రీ శక్తి, ఆటో కార్మికుల సంక్షేమ పథకాలను కలిపి అమలు చేయాలి.

-జి.దుర్గా ప్రసాద్, జిల్లా అధ్యక్షులు, సిఐటియు



అర్జీలు స్వీకరిస్తున్న జెసి నిషాంతి

అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పరిష్కారంలో స్పష్టత తప్పనిసరిగా ఉండాలన్నారు. అర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు అత్యంత చేరువుగా సుపరిపాలనను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన ఆర్జీలకు పరిష్కారం చూపడంలో జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్జీల పరిష్కారంలో స్పష్టత ఉన్నప్పుడే పరిష్కారం అవుతాయని, లేదంటే సమస్య పునరావృతమవుతూనే ఉంటుందన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై ప్రజల పెట్టుకున్న నమ్మకానికి మరింత బలం చేకూర్చేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. అర్జీల పరిష్కార వ్యవస్థ పటిష్ట పర్యవేక్షణకు, అర్జీ స్వీకరిం చింది మొదలు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించే వరకు ప్రతి దశలోనూ పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డిఆర్ఒ మాధవి మాట్లాడుతూ అర్జీలు పరిష్కార తీరు పారదర్శకత, నాణ్యత ఉండాలన్నారు. అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన ఆర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో సుమారు 260 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ మధుసూదన్, సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ, ఎస్‌టిసి పి.కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ వేణుగోపాల్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వేతనం చెల్లించాలంటూ వినతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మండలంలోని ఎంపిటిసి సభ్యులకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని చెల్లించాలని పలువురు ఎంపిటిసిలు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో ఎంపిపి వీరా మల్లిబాబు, ఎంపిటిసి సభ్యులు ఎంపిడిఒ కె.సూర్యనారాయణ, తహశీల్దార్ వెంకటేశ్వరరావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ నుంచి 2025 ఏప్రిల్ నెల వరకు రూ.13.20 లక్షల బిల్లు మొత్తాన్ని సిఎంఎఫ్ఎస్ వెబ్ పోర్టల్‌లో అనుమతి కొరకు అప్‌లోడ్ చేశామని తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి మల్లిబాబు, ఎంపిటిసిలు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులకు విడుదలైన చెక్కులను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని మురముళ్లలో ఉన్న ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. 159 మంది లబ్ధిదారులకు రూ.87 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఇప్పటి వరకూ 430 మంది లబ్దిదారులకు రూ.3.25 కోట్లను సిఎంఆర్ఎఫ్ నుంచి అందజేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎదుర్లంక గ్రామంలో కీర్తిశేషులు ముదునూరి సాయిబాబారాజు పేరున విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపి గంటి హరీష్మాధూర్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ అధికారి ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని సాయిబాబా రాజు సేవలను కొనియాడారు. ముందుగా సాయిబాబురాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, ముదునూరి సతీష్‌రాజు, పిన్నమరాజు శ్రీనురాజు, కాకర్లపూడి బుజ్జి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజల కోసం పని చేసేదే 'ప్రజాశక్తి'

ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు

ప్రజాశక్తి - అమలాపురం

నిరంతరం ప్రజల పక్షాన పనిచేసే పత్రిక 'ప్రజాశక్తి' అని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం 'ప్రజాశక్తి' 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నది ఉన్నట్లుగా రాసే దమ్మున్న పత్రిక ప్రజాశక్తి అని అందుకే ప్రజాశక్తి ప్రజల పక్షాన్ని పని చేస్తుందని అన్నారు. యాజమాన్యం లేకుండా ప్రజలతో నడిచే పత్రిక ఉన్నదంటే అది ఒక ప్రజాశక్తి మాత్రమేనని అన్నారు. ప్రజాశక్తి పత్రికలో వచ్చే కథనాలు ఆయా శాఖల అధికారులకు కనువిప్పు కలిగిస్తాయని తెలిపారు. ప్రతిరోజు తోటి పత్రికలతో పాటు ప్రజాశక్తి పత్రికను చదివిన తర్వాతే బయటకు వస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, కెఆర్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణరావు, నాయకులు కల్వకొలను తాతాజీ, బిఎస్.మూర్తి, పోలిశెట్టి శివాజీ, వంకాయల రాజా, ఉప్పుగంటి భాస్కరరావు, యర్రమిల్లి పాండురంగరావు, ఎరగర్త వెంకటేశ్వర రావు, ప్రజాశక్తి సిబ్బంది సురేష్, కుమార్, దుర్గారావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

గ్రామాల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

గ్రామాల సుస్థిర అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల సుస్థిర అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, పిల్లల్లో స్నేహ పూర్వక వాతావరణం కల్పించడం, పరిసరాలు పరిశుభ్రత, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన సర్పంచులు, మండల పరిషత్ కార్యాలయ ఎఒ చాగంటి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపిడిఒ సలక్ట్ రాజు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ట్రైనర్

ఘనంగా ఇంజినీరింగ్ డే

ప్రజాశక్తి - రాజోలు

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా మలికిపురం ఎంవిఎన్, జెఎస్, ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాలలో ఇంజినీరింగ్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. వికసిత్ భారత్‌ను నిర్మించడానికి సమిష్టి ప్రయత్నాలతో భారతీయ ఇంజనీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్.ఆనందమహని, కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చిట్టాల సత్యనారాయణ, పీడీ పిడికె.ప్రసాద్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, ఎన్.రమేష్‌బాబు, ఎన్.ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో స్కూల్ గేమ్స్ వాయిదా

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారీ వర్షంతో మండల స్థాయి స్కూల్ గేమ్స్ వాయిదా వేసినట్లు ఎంఇఒలు తాడి వీరరాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బాలికల గేమ్స్ ప్రారంభం అయిన కొంతసేపటికే భారీ వర్షం కురవడంతో షెడ్యూల్ ప్రకారం జరగవలసిన అవుట్ డోర్ గేమ్స్ వాయిదా వేసి, ఇండోర్ గేమ్స్ షట్టల్, చెస్, యోగలో ఎంపికలు నిర్వహించినట్లు మండల ఇన్‌ఛార్జ్ లక్ష్మిశ్రీనివాస్ తెలిపారు.

'డంపింగ్ యార్డును తొలగించాలి'

ప్రజాశక్తి - అయినవిల్లి

పంట పొలాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని సిరిపల్లి గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు స్థానిక మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. సిరిపల్లి జంక్షన్ రోడ్డులో పంట పొలాలే అధికంగా ఉన్నాయని తెలిపారు. గత రెండు నెలల నుంచి ఆ రోడ్డు పంట బోధిని ఆనుకుని పంచాయతీలో సేకరించిన చెత్తను డంపింగ్ చేస్తున్నారని అన్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడంతోపాటు, ఎలుకలు వృద్ధి చెంది పంట పొలాలకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పంట పొలాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు రైతులు తెలిపారు.

ఆడ బిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

ఆడబిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారులు డాక్టర్ ఎన్.లక్ష్మీస్నేహ, డాక్టర్ డి.సాయికిషోర్ అన్నారు. సోమవారం మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పిహెచ్‌సిలలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై అవగాహన కల్పిస్తు ర్యాలీలు నిర్వహించాలన్నారు. రక్తహీనత, తల్లి - శిశు సంరక్షణ, మంచి పోషకాహారం, పరిశుభ్రత, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనంతరామకృష్ణ, డాక్టర్ కె.భాగ్యశ్రీ, హెల్త్ విస్తరణ అధికారి జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఎవివి.రాజా, బి,సూర్యనారాయణ, సిహెచ్ఒ ఎంఎస్ఎన్.రెడ్డి హెల్త్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయికిషోర్

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మామిడికుదురు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రాజోలు సహాయ పశు వైద్య సంచాలకులు డాక్టర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రారంభించారు.ముందస్తు గా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, జాలెం ఉమా పార్వతి, నీటి సంఘం డైరెక్టర్ తాటికాయల ఉదయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి కూనపరెడ్డి సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** మండలంలోని మడికిలో పశు సంవర్ధశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు దొండపాటి సుబ్బరాజు, పాలూరి బుల్లబ్బాయి, పశు వైద్యులు డాక్టర్ డి.వినోద్‌కుమార్, అసిస్టెంట్ డాక్టర్ వి.సూర్యనారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలోని నేలటూరు, వాకతిప్ప గ్రామాల్లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశు వైద్యాధికారులు డాక్టర్ వివి.రమణమూర్తి, డా.లక్ష్మీకుమారి మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. **రావులపాలెం** మండలంలోని పొడగట్లపల్లిలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల పశువైద్యాధికారి సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ వెటర్నరీ అధికారి కెవి.రామారావు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు ప్రభాకర్, వెంకటలక్ష్మి, ఇంటాస్ కంపెనీ ప్రతినిధి మల్లేష్, గ్రామ పెద్దలు అల్లూరి పెదకృష్ణంరాజు, గోపిశెట్టి సత్తిపండు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పేదల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉప్పలగుప్తం పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం మండలంలోని చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలోని 36 రేషన్ షాపుల పరిధిలో 18,588 కార్డుదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా ఎపీడీ డి.రాంబాబు, తహశీల్దార్ వివిఎస్.దివాకర్, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** మండలంలోని హసన్‌బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేషన్ వినియోగదారులు సరుకులు తీసుకోవడంలో సులభతరం చేయడానికి, ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండడానికి స్మార్ట్ కార్డు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** మండలంలోని సవరప్పాలెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎఎంసి వైస్ ఛైర్మన్ పరమట చిట్టిబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. తమ గ్రామంలో 370 స్మార్ట్ రేషన్‌కార్డులు ఉండగా, వాటిలో 9 కార్డులపైన మాత్రమే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాగా రాలేదన్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వాన్ని కొంతమంది ఇరుకున పెట్టేలా ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. ఎవరైనా మార్పులు చేర్పులు చేసుకోవాలంటే అక్టోబర్ 31 లోపు సంబంధించిన సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సత్తి అనిల్, రాంబాబు, సత్తి సూరిబాబు, అధికారులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో కార్డులు పంపిణీ చేస్తున్న అయితాబత్తుల



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. సోమవారం మండలంలోని కోమానపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు మాట్లాడారు. రాజ్‌కమల్ ఫౌండేషన్ నిర్వాహకులు యర్రమెల్లి జయరాం ఆధ్వర్యంలో డిసెంబర్‌లో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు హాజరయ్యే 9 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, త్రిమూర్తులు, ఎస్ఎన్.మురళీశ్వరరావు, ఆర్.నాగార్జున, ఎస్.రాంబాబు, కె.సూర్యనారాయణమ్మ, పి.వికాషిణి పాల్గొన్నారు.

టెన్త్ ఉత్తీర్ణతతో మరింత ప్రగతి

ప్రజాశక్తి- మామిడికుదురు

10వ తరగతి ఉత్తీర్ణతలో మరింత ప్రగతిని సాధించేలా కృషి చేయాలని ఎంఇఒలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌పి కార్యాలయంలో టెన్త్ విద్యార్థులకు సేట్ బయోపామ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం బి.చిరంజీవి, జిల్లా కోఆర్డినేటర్ చప్పిడి వెంకటేశ్వరరావు, బయోలజీ ఉపాధ్యాయులు సిహెచ్ గోపి, ఎస్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

నేరాలు ఘోరాలు

అనధికార బాణసంచా సీజ్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గ్రామ శివారు హైవే రోడ్డు దగ్గరలో కొవ్వూరి సుధాకరరెడ్డి రేకుల షెడ్డులో అనుమతి లేని బాణాసంచాను పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ జి.నరేష్ మీడియాకు వివరించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందస్తు సమాచారం మేరకు జొన్నాడలో దీపావళి బాణాసంచా నిల్వ చేసినట్లు తెలిసిందన్నారు. నిల్వ చేసిన ప్రాంతాన్ని గుర్తించి బాణాసంచాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బాణాసంచా విలువ రూ.2,07,165 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సూర్యచంద్రం, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పలు చోరీ కేసులో ముద్దాయికి ఆలమూరు జెఎఫ్‌సిఎం కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ జైలు శిక్ష విధించారు. ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... 2024 జూలై 23న మండలంలోని టేకి గ్రామంలో జరిగిన చోరీ ఘటనపై అప్పటి ఎస్ఐ పరదేశి కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన నిందితుడు రేవు శ్రీనివాస్‌కు ఒక్కొక్క కేసులో మూడేళ్ల జైలు శిక్ష రూ.10 వేలు జరిమానాతో పాటు జరిమానా కట్టకపోతే అదనంగా 3 నెలల వరకు జైలు శిక్ష విధించినట్లు తీర్పు చెప్పారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విల్ల శ్రీరాములు ఫిర్యాదుదారుల తరపున వాదించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి


మురారిలో గుర్తు తెలీని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. హైవే రోడ్డులో అంబేద్కర్ సెంటర్ వద్ద 65 ఏళ్ల మహిళ నడుచుకుని వెళుచుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమెను గాయపడిన ఆమెను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఆమె మృతి చెందినట్టు తెలిపారు.


నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎర్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. జెఎసి జగ్గంపేట అధ్యక్షుడు పి.శ్రీనివాసరాజు మాట్లాడారు. విద్యుత్ శాఖ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకం అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని. విద్యుత్ శాఖలో అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని దశలవారీ ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 17, 18 తేదీల్లో కాకినాడ విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కె.అప్పారావు, బాబ్జి, క్యాలంగి సతీష్, శ్రీనివాస్ ఉన్నారు.


ఎంపిడిఒ శ్రీలలితను సన్మానిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఎంపిడిఒ శ్రీలలితకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎంపిడిఒ శ్రీలలిత విశాఖ జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన సందర్భంగా సోమవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే సత్యవతి, డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె మంగా లక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసీలు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

ధాన్యం కొనుగోలు విషయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై సోమవారం సామర్లకోట మండల కార్యాలయంలో మండల పరిధిలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, విఎఎలు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ అధ్యక్షత వహించారు. సివిల్ సప్లయ్ ప్రతినిధి దుర్గాప్రసాద్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయాలన్నారు. వెహికల్ రిజిస్ట్రేషన్, కూపన్ జనరేషన్, జిఎల్‌టి, ట్రక్ షీట్ జనరేషన్, విఎ హెల్పర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్, ఎఇఒలు శాంతి కమల, రూప, టెక్నికల్ అసిస్టెంట్లు దుర్గాప్రసాద్, శ్రావణి పాల్గొన్నారు.

రైల్వేలైన్ పూర్తి చేసేందుకు కృషి

ప్రజాశక్తి - అమలాపురం


ఎంపి హరీష్‌ను పూలమాలతో సత్కరిస్తున్న బృందం

కోనసీమ రైల్వేలైన్ పూర్తి చేయాలని కోరుతూ కోనసీమ రైల్వే సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంపి హరీష్‌మాధుర్, ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ నత్తనడకన నడుస్తుందన్నారు. కోనసీమ అభివృద్ధికోసం రైల్వేలైన్‌ను తొందరగా పూర్తి చేయాలని కోరారు. రెండేళ్ల కిందట అర్ధంతరంగా మూతపడిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను తిరిగి తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ, కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కోసం తన తండ్రి బాలయోగి చాలా కృషి చేశారని, తన ప్రస్తుత పదవీ కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను తెరిచేలా తక్షణమే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ చుట్టుపక్కల జిల్లాలతో పోలిస్తే కోనసీమ బాగా వెనక బడి ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి జిల్లా ప్రజాప్రతినిధులందరూ సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్ డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణరావు, సభ్యులు కల్వకొలను తాతాజీ, బివిఎస్.మూర్తి, పోలిశెట్టి శివాజీ, వంకాయల రాజా, ఉప్పుగంటి భాస్కరరావు, ఎర్రమిల్లి ప్రభాకరరావు, ఎగరగ్గ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారిణి కీర్తి అమూల్యను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

కుడోలో మోడరన్ విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థి వి.కీర్తిఅమూల్య కుడో పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 14న వైజాగ్‌లో జరిగిన కుడో రాష్ట్ర స్థాయి పోటీలో ఆమె ఈ ఘనతను సాధించింది. అనకాపల్లి ఎంఎల్ఎ కొనతల రామకృష్ణ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌ను అందుకుంది. ఈ సందర్భంగా సోమవారం మోడరన్ కాలేజీలో జరిగిన అభినందన సభలో కీర్తి అమూల్యను మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా జివి.రావు మాట్లాడుతూ కీర్తి అమూల్య భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో ప్రతిభ చాటి ఉన్నత స్థానానికి చేరాలని ఆకాంక్షించారు. అక్టోబర్‌లో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో మెరుగ్గా రాణించడానికి కృషి చేస్తానని కీర్తి అమూల్య తెలిపారు.


మెడల్స్, సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

కరాటేలో 'సిద్ధార్థ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటర్ స్టేట్ లెవెల్ కరాటే టోర్నమెంట్ పోటీలలో ఆలమూరులోని శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ నెల14న అమలాపురం సమీపంలోని బిఆర్‌కె ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పోటీల్లో బాలికల జూనియర్స్ కత్తి మూమెంట్ ఎ విభాగంలో అనుశ్రీ కార్తీక, బాలుర ఫైటింగ్ ఇ విభాగంలో గెద్దాడ జాయ్‌కిరణ్, కటాస్ ఎ విభాగంలో డి.సాయిదత్త, కటాస్ బి విభాగంలో కె.సాకేత్ గోల్డ్ మెడల్స్ సాధించారు. ఫైటింగ్‌లో గుత్తుల షణ్ముఖ, కటాస్ ఎ విభాగంలో పాలూరి సాయిచరణ్‌సంతోష్‌కుమార్ సిల్వర్ మెడల్స్ సాధించగా, బి విభాగంలో సంగీత సత్యవెంకటఆదిత్య బ్రాంజ్ మెడల్‌తో విజేతగా నిలిచాడు. దీంతో విజేతలను సిద్ధార్థ సంస్థల అధినేత కె.ముల్లారావు, కోచ్ టి.వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.


విలేకరుల సమావేశంలో బిసి సంఘ నాయకులు

కులాల మధ్య చిచ్చురేపిన వైసిపి

ప్రజాశక్తి - ఆలమూరు

బిసి సర్టిఫికెట్లు జారీలో గత వైసిపి ప్రభుత్వం కులాల మధ్య చిచ్చురేపిందని బిసి సంఘ నేతలు విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో బిసి సంఘ నేతలు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, ఈడిగ, యాత కులాలు గీత కులాలని, కులవృత్తి ఒకటేనని అన్నారు. అయితే గత వైసిపి పాలనలో బిసి సర్టిఫికెట్ల జారీలో చేసిన అవకతవకల వల్ల తమ కులాల మధ్య చిచ్చుగా మారిందన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో ఐదు కులాల నాయకత్వం ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల బిసి సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, కాలా జయరాజు, ఎఎంసి ఉపాధ్యక్షుడు కేతా రాంబాబు, టిడిపి బిసి నాయకులు అనుసూరి శివప్రసాద్, దొంగ భాస్కరరావు, దొంగ సుధాకర్, టేకుమూడి వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

సిఆర్‌కి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయం చైర్మన్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు కప్పల వరప్రసాద్(సిఆర్)కు కన్నీటి వీడ్కోలు పలికారు. శనివారం వరప్రసాద్ మృతి చెందారు. బంధువులు, సన్నిహితులు, స్నేహితులు సందర్శనార్థం ఆయన పార్థివదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.


వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ సీతారామమూర్తి

పిజిఆర్ఎస్‌లో 152 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని డిఆర్ఒ టి.సీతారామమూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ భవనంలో ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిజిఆర్ ఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.భాగ్యలక్ష్మి, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, ఎ.స్లీవారెడ్డి, లేబర్ సహాయ కమిషనర్ వలీ, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

అభ్యుదయ రైతులకు సత్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో అభ్యుదయ రైతులను జిల్లా అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ గత రెండు సీజన్లలో రాజమహేంద్రవరం రూరల్ మండలం, సీతానగరం మండలానికి చెందిన అభ్యుదయ రైతులు నానో ఎరువుల వినియోగం ద్వారా మంచి ఫలితాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రేడు మండలానికి చెందిన అభ్యుదయ రైతులు సుంకవల్లి చౌదరి, ఎన్.వి.వి. శ్రీనివాస్, చిన్నకొండేపూడి గ్రామానికి చెందిన జి.నాగరాజు, కె.సతీష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, మత్స్య డిడి టి.నిర్మల కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అనుబంధ అధికారులు, ఇఫ్కో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎసి శ్రీనివాసరావు

రూ. 10 లక్షలు దాటితే వృత్తి పన్ను కట్టాలి

ప్రజాశక్తి - రాజానగరం

వార్షిక ఆదాయం రూ.10 లక్షలు దాటిన వారంతా వృత్తి పన్ను ఏడాదికి రూ.1,250 చెల్లించాలని సేల్స్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎవి.శ్రీనివాసరావు అన్నారు. ఇది ఆ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తారని చెప్పారు. రాజానగరంలో సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం ఆవరణలో వృత్తి పన్నుపై స్థానిక వర్తక వ్యాపారులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. అమ్మకం, ఆదాయంపై ప్రభుత్వం జిఎస్‌టిల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ ఎ.సురేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంకటాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిజిఆర్ఎస్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల అర్జీలను గడువులోగా సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి 21 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూకి సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్‌కు 5, ఇంజినీరింగ్ శాఖకు 10, వార్డు సచివాలయాలకు 3, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి 1, మెప్మాకు సంబంధించి ఒకటి ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సిహెచ్.శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న గ్రామస్తులు

అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి - పెరవలి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న మండలం తీపర్రు నెంబర్-1 పాఠశాల ఉపాధ్యాయుడు కె.శ్రీనివాస్, నెం-2 పాఠశాల ఉపాధ్యాయుడు పి.రవికుమార్‌లను సోమవారం ఘనంగా సన్మానించారు. అవార్డులు పొందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు అనంతరం ఇరువురిని దుస్సాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో నారాయణరావు, ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

ఫైలేరియాను అరికట్టేలా చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు, మామిడికుదురు


మామిడికుదురులో పరీక్షిస్తున్న వైద్య బృందం

బాల్య దశలోనే ఫైలేరియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం మండలంలోని మూలస్థాన అగ్రహారం ప్రభుత్వ పాఠశాల, మడికి రవీంద్ర పాఠశాలలో ఫైలేరియాపై సర్వేను నిర్వహించారు. చొప్పెల్ల పిహెచ్‌సి వైద్య అధికారి ఎన్.లక్ష్మీస్నేహతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు రక్త నమూనాలు తీసుకొని పరీక్షలు నిర్వహించారు. ఇంటి నివాసాలలో, పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు పరిశుభ్రంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నమూనాలలో వచ్చిన రిపోర్టుల ఆధారంగా ఎవరికైనా ఫైలేరియా గుణం ఉన్నట్లుగా నిర్ధారణ అయితే వైద్య సేవలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్.వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ పి.శివ ప్రసాద్, విహెచ్‌వి. సత్యనారాయణ, ఎల్‌టి మౌనిక, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. అలాగే మామిడికుదురు మండలం అప్పనపల్లి మోడల్ స్కూల్లో సోమవారం 1, 2 తరగతుల విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామూల్ ప్రణయ్, స్కూల్ హెచ్ఎం నైనాల రఘురామయ్య, ఎంపిహెచ్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బల్ల నరసింహారావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, ఎంపిహెచ్ఇఒ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీని నిలిపివేయాలని వినతి

ప్రజాశక్తి - అంబాజీపేట, అయినవిల్లి


అంబాజీపేటలో వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

జిల్లా పేరును తప్పుగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని నిలిపివేయాలని మాల మహానాడు అధ్యక్షులు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని ముద్రించిన తరువాతే కార్డులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆధార్ కార్డుల్లోనూ జిల్లా పేరు మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్‌తోపాటు,


వినతిపత్రం ఇస్తున్న గిడ్డి వెంకటేశ్వరరావు

ఎంఎల్ఎ, ఆర్‌డిఒలకు వినతిపత్రాలను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు. అలాగే అయినవిల్లి మండలానికి చెందిన దళిత సంఘాల జెఎసి నాయకులు కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని నిలుపుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాలమహానాడు అధ్యక్షుడు గిడ్డ వెంకటేశ్వరరావు, కుసుమ బహుగుణ, సరెళ్ళ సత్యనారాయణ, సరెళ్ళ నాగపండు, ఎం.టింకు, డి.మధు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. సోమవారం జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేతకాని తనం వల్ల యూరియా కొరత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ లింకుతో రైతుకు ఒక బస్తా మాత్రమే సరఫరా చేయడం దారుణమన్నారు. దీంతో రైతులు ప్రయివేటు దుకాణాల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యూరియా కొరత లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అల్లూరి మధురాజు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కన్వీనర్ దేసినీడి ఉదయభాస్కరరావు, కోఆర్డినేటర్ మీసాల బాబీ, ఎఐసిసి సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు నీటిపూడి బాల సత్యనారాయణ, మూలపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేట ఎంపిడిఒగా మమత

ప్రజాశక్తి - అంబాజీపేట


ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

అంబాజీపేట ఎంపిడిఒగా బి.మమత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వర రావు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఇఒపిఆర్‌డిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఎపిఎల్.నరసింహం, డిప్యూటీ ఎంపిడిఓ కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తపేట


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

వ్యాపార సంస్థల వద్ద తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డిఎస్‌పి సుంకర మురళీమోహన్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ వ్యాపార సముదాయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కొత్తపేటలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలను నిర్వహించుకోవాలని అన్నారు. అనుమతి లేకుండా బాణా సంచా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ జి.సురేంద్ర, వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్థాయిని మరచి విమర్శలు సరికాదు

ప్రజాశక్తి - అమలాపురం


మీడియాతో మాట్లాడుతున్న శెట్టిబలిజ నాయకులు

మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదని శెట్టిబలిజ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, విత్తనాల జయబార్గవ్ అన్నారు. సోమవారం స్థానిక కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోనసీమలో జరిగిన అల్లర్ల సమయంలో శెట్టిబలిజలను ఇబ్బందులకు గురి చేసినప్పుడు ఈ నాయకులంతా ఏమయ్యారని ప్రశ్నించారు. వైసిపి టికెట్ ఇవ్వకుండా కులాన్ని బొచ్చుతో సమానంగా చూశారని గుర్తుంచుకోవాలన్నారు. శెట్టిబలిజలకు అండగా నిలిచిన మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి లేదని గుర్తుంచుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో శెట్టిబలిజ నాయకులు వరసాల శ్రీనివాస్, మట్టపర్తి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE) cum 3RD ADDL. JUNIOR CIVIL JUDGE COURT : ELURU

I.A. 61/2023 in O.S. 356/2021

Between:

NELAPATI ADINARAYANA ...Plaintiff

and

D2 : THIRRI SRI PRIYA, D/o. Parvathi (Late), Hindu, Age 34 Years, House Wife, R/o. F.B.O.Wild Range Forest Office, Forest Range Office Back Side, S.P.Office, Madhura Nagar, Kakinada, Kakinada District, A.P. ...Defendant No.2

పై నెంబరు I.A.No. 61/2023 in O.S. 356/2021 శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టువారు మీకు ఈ I.A. నోటీసులు పేపరు ప్రకటన ద్వారా అమలు పరుచుటకు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు శ్రీ కోర్టువారి ఎదుట **ది. 22-09-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు గానీ, మీ తరఫున ప్లీడరు గారి ద్వారా గానీ స్వయముగా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానం చేయగలరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

ఏలూరు **CH. శ్రీనివాసరావు**
ది.15-09-2025 అడ్వకేట్, ఏలూరు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు, కొవ్వూరు

O.S. No. 35/2025

Between:

Kakarala Akka Lakshmi ***...Plaintiff***

AND

Kakarala Udaya Lakshmi ***...Defendant***

To:

Kakarala Udaya Lakshmi, W/o. (late) Kakarala Srinivas, Hindu, aged 55, Resident of D.No. 3-38, Nidadavolu Road, Devarapalli Mandal, Verrnagudem, W.G.Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-9-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొవ్వూరు **యిన్నమూరి బాలసుబ్రహ్మణ్యం**
14-9-2025 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, రాజమహేంద్రవరం

ఓ.యస్. నెం. 237/2025

బిట్వీన్:

సత్తి సత్యనారాయణరెడ్డి **-వాది**

మరియు

గీసాల శ్రీను మరియు వగైరాలు **-ప్రతివాదులు**

1వ ప్రతివాది: గీసాల శ్రీను, తండ్రి: అప్పారావు, డో.నెం. 3-31, నందరాడ గ్రామం, రాజానగరం మండలం, తూ॥గో॥జిల్లా.

2వ ప్రతివాది: శ్రీమతి పిల్లి ముని, భర్త: నాగేశ్వరరావు, డో.నెం. 3-61, నందరాడ గ్రామం, రాజానగరం మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలోని 1, 2 ప్రతివాదులకు కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఎన్నిసార్లు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపిననూ సదరు సమన్లు పుచ్చుకోకుండా కాలయాపన చేస్తున్న కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా సమన్లు పంపమని ఉత్తర్వు వేసినందున సదరు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు 1, 2 ప్రతివాదులు **ది. 06-10-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

//కోర్టు వారి అనుమతితో//

పి.వి.వి.యస్.బి.రాజు
రాజమహేంద్రవరం **జి.సత్యనారాయణ**
తేది:12-9-25 అడ్వకేట్స్, రాజమండ్రి